క్లుప్తంగా

అంబేద్కర్ ఆదర్శనీయుడు


పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శనీయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఆదిల్‌పేట్‌లో జెడ్పీటీసీ వేల్పుల రవి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎంపీపీ గుర్రం మంగతో కలిసి ఆవిష్కరించారు. ఆదిల్‌పేట్‌లోని ఈ సెంటర్‌ను అంబేద్కర్ చౌక్‌గా పిలవాలని సూచించారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు, అంబేద్కర్, దళిత, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నూతన జేడీకి సన్మానం


సన్మానిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న డాక్టర్ శంకర్ జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టీఎన్జీవోస్ సభ్యులు బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, ఉపాధ్యక్షులు తిరుపతి, సంయుక్త కార్యదర్శి సునిత, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు గోపాల్, కార్యదర్శి అజయ్, సతీశ్, విజయ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్: వర్షాకాలం సీజన్లో ప్రబలే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ లోకనాథ్ రెడ్డి తెలిపారు. ఆర్కే 7 గనిపై బుధవారం వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చే సీజనల్ వ్యాధులపై ఆయన అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించడం వల్ల సీజన్ వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. ముఖ్యంగా పరిసరాల్లో చెత్తాచెదారం, దోమలు ఈగలు వ్యాప్తి లేకుండా చూడాలన్నారు. నివాస ప్రాంతాలకు చుట్టూ ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీధర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కిషన్ రావు, ఫిట్ సెక్రెటరీ రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేద్దాం


సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

దండేపల్లి: అధికారంలో లేకున్నా, ప్రజల కోసం పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. దండేపల్లి మండలంలోని పద్మశాలీ భవన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు ఆయన పలు సూచనలు చేశారు. మండల పరిషత్ సభ్యుల పదవి కాలం ముగియడంతో, బీఆర్ఎస్‌కు చెందిన వైస్ ఎంపీపీ అనిల్‌ను పార్టీ కార్యకర్తలు శాలువాలతో సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, మాజీ ఉపసర్పంచ్ భూమన్న, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకర్‌కు జీఎం అభినందన


సంయుక్తను సన్మానిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ గ్రూప్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించిన శ్రీరాంపూర్ విద్యార్థిని జి.సంయుక్తను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అభినందించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఐటీ విభాగం అధికారి శ్రీనివాస్ కూతురు అయిన సంయుక్త ఇంటర్మీడియట్‌లో 1000మార్కులకు గాను 988 మార్కులు సాధించి మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం జీఎం తన చాంబర్లో విద్యార్థిని శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓటు జీఎం ఏవీ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, రక్షణ అధికారి శ్రీధర్ రావు, డీజీఎం చిరంజీవిలు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

నీట మునిగిన అండర్ బ్రిడ్జి



మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని హమాలివాడకు వెళ్లే దారిలో గల రైల్వే అండర్ బ్రిడ్జి మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నీటితో నిండిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు వరద నీటితో నిండినా, నీటిని తొలగించేందుకు మోటార్లు ఉన్నా, నీటిని తొలగించడంలో తాత్సారం చేయడంతో టూటౌన్‌కు చెందిన విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఇతరత్ర పనుల నిమిత్తం ఉదయమే బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్ పరిశీలించి, వరద నీరు నిలిచి ఉండడం, బయటకు పంపించేందుకు చేపట్టాల్సిన వాటితో పాటు, రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు.

కంకరపోశారు.. వదిలేశారు..!

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లి నుంచి కంచర బాయి గిరిజన గ్రామం వరకు రూ.కోటికి పైగా నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించి ఏడాది దాటినా ఇంకా పూర్తికాలేదు. కంకరపోసి వదిలేశారు తప్పా, బీటీ వేయడం లేదు. దీంతో కంచరబాయి గిరిజనులతో పాటు, మామిడిపల్లి, కొత్తమామిడిపల్లి గ్రామాల రైతులు కంచరబాయి శివారులోని పొలాలకు కంకర పోసిన రోడ్డుగుండా వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు.



విద్యార్థులు కూర్చునేదెలా..!



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల భవిత కేంద్రంలో విద్యార్థులు ఉండాల్సిన చోట పాఠ్యపుస్తకాలు నిండిపోయాయి. మంచిర్యాల, హజీపూర్ మండలాలకు చెందిన వర్క్ బుక్స్, అభ్యసన పుస్తకాలతో గదిలో నింపారు. ఇంకోవైపు యూనిఫాంకు సంబంధించిన ముడివస్త్రం అక్కడే ఉండటంతో దివ్యాంగులు కూర్చోడానికి కూడా స్థలం లేకుండా పోయింది? పక్కనే మరో గది ఖాళీగా ఉన్నా, భవిత కేంద్రంలోనే ఏర్పాటు చేయటంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. పాఠ్యపుస్తకాలు ఖాళీ చేసి భవిత కేంద్రం గదిలో విద్యార్థులు కూర్చునేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా వన మహోత్సవం

- ఊరూరా మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు

బెల్లంపల్లి/కాసిపేట/మందమర్రిరూరల్/తాండూర్/జన్నారం/భీమారం/రామకృష్ణాపూర్: మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారమని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఊరూరా వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వృక్షాలను విచ్చలవిడిగా నరికివేయడం, ప్లాస్టిక్ వస్తువులను ఇష్టారాజ్యంగా వినియోగిస్తుండటంతో మానవాళికి ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇప్పటికే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని పేర్కొన్నారు. ఆ ప్రతికూల పరిస్థితుల నుంచి బయట పడటానికి ప్రతి ఒక్కరూ ఒకటి చొప్పునా మొక్కనాటి భూమి సమతుల్యతను కాపాడాలని సూచించారు. భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యతగా భావించాలన్నారు. జన్నారం మండలం మొర్రిగూడలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మొక్కలు నాటారు. అనంతరం కామన్‌పల్లి గ్రామంలో కమ్యూనిటీ హాలు భవనాన్ని ప్రారంభించారు. బెల్లంపల్లి, కాసిపేటలో జరిగిన వనమహోత్సవంలో డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్ పాల్గొని మొక్కలు నాటగా, మందమర్రి మండలం ఆదిల్‌పేట్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరై అధికారులతో కలిసి మొక్కలు నాటారు. తాండూర్‌లో మండలంలోని రేచిని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు పాల్గొని మొక్కలు నాటారు. మందమర్రిలో ఏరియా జీఎం మనోహర్, ఆయన సతీమణి, ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు సవిత


కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లి, కాసిపేటలో మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ మనోహర్, శాంతిఖని ప్రాజెక్టు అధికారి విజయప్రసాద్, బెల్లంపల్లి ఎఫ్‌డీవో వినయ్‌కుమార్, ఎఫ్ఆర్‌వో సుభాష్, శాంతిఖని గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు. మందమర్రిలో ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో సఫ్దర్‌అలీ, తాండూర్‌లో ఎంపీవో అక్తర్ మోహినుద్దిన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, జన్నారంలో అదనపు డీఆర్‌డీవో దత్తారాం, ఎంపీడీవో శశికళ, ఎంపీపీ సరోజన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. భీమారంలో ఎంపీవో శ్రీపతి బాపు, ఈజీఎస్ ఏపీఎం జీనత్, కార్యదర్శి వేముల శ్రీనివాస్, రామకృష్ణాపూర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, ఈశ్వరాచారీ, వేణుగోపాల్, మందమర్రిలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, పర్యావరణ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


కేకే-2 బంగ్లాస్ ఏరియాలో...


ఆదిల్‌పేట్‌లో మొక్క నాటుతున్న జెడ్పీ చైర్‌పర్సన్


భీమారం మండలం పోతన్‌పల్లి పాఠశాలలో...


మొక్క నాటుతున్న నాయకులు


ముత్యంపల్లి హైస్కూల్‌లో...


మొక్క నాటి నీరు పోస్తున్న డీఎఫ్‌వో, పక్కన జీఎం


తాండూర్: మొక్క నాటుతున్న డీపీవో, తదితరులు

ముందస్తు టీకాలతోనే వ్యాధుల నివారణ

- జిల్లా పశువైద్యాధికారి శంకర్

బెల్లంపల్లిరూరల్: పశువులకు ముందస్తు టీకాలు వేయించడంతోనే వ్యాధులను నివారించవచ్చని జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ అధికారి ఇ.శంకర్ అన్నారు. బెల్లంపల్లి మండలం కాసిరెడ్డి పల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన లంపిస్కిన్ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. పశువుల యజమానులు పశువుల సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించి,


టీకా వేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి


అధిక పాల దిగుబడిని ఇచ్చే మేలైన గేదెలను, ఆవులను పెంచాలని సూచించారు. ప్రభుత్వం పాడి రైతుల అభ్యున్నతికి అనేక సబ్సిడీ పథకాలు ప్రవేశపెడుతోందని వాటిని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల పశువైద్యాధికారి దిలీప్, సిబ్బంది శ్రావణ్, వెంకటేష్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలకు సిద్ధం

- ఓ వైపు సర్వే.. మరో వైపు షోకాజ్ నోటీసులు జారీ

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: పట్టణ పరిధిలో పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రాంగం సిద్ధం అవుతోంది. జిల్లాలోని పలు ప్రభుత్వ భూముల కబ్జాలపై గత నెల 28న 'సాక్షి'లో 'సర్కారు భూములు కబ్జా' కథనానికి స్పందించిన అధికారులు పట్టణ పరిధిలో నస్పూర్ శివారు సర్వే నంబర్ 42లో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా మున్సిపల్ అధికారులు సర్వే నంబర్ 42లోని పలు నిర్మాణాల యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్


మున్సిపల్ అధికారులు జారీ చేసిన షోకాజ్ నోటీసు

చిట్యాల సతీష్‌ను సంప్రదించగా సర్వే నంబర్ 42లో సుమారు పది నిర్మాణాలకు సంబంధించిన యజమానులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు అందుకున్న యజమానుల నుంచి వచ్చే వివరణను పరిశీలించి చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. పంచాయతీ ఉద్యోగులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్, పంప్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ మల్టీపర్పస్ వర్కర్లం చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా, నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో పెడుతున్నారన్నారు. కనీసం వేతనం చెల్లించాలని, జీవో నెం 51 ఇచ్చే నాటికి గ్రామపంచాయతీలో పనిచేసే వారికి మల్టీపర్పస్


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ప్రతీ ఉద్యోగికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు మురళీధర్, శ్రీనివాస్, బాపన్న, వెంకటచారి, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

దండేపల్లి: మండలంలోని మామిడిపల్లికి చెందిన అలిశెట్టి సహస్ర బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యింది. మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన సహస్ర పదిలో 9.8 జీపీఏ సాధించి, మండల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కోటపల్లి: ఇటీవల విడుదలైన బాసర ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిన పుట్ట హన్సిక, ఇప్ప శ్రీనిధి, జ్యోత్స ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు.


అలిశెట్టి సహస్ర


ఇప్ప శ్రీనిధి

మందమర్రిరూరల్: స్థానిక మోడల్ స్కూల్‌లో పదో తరగతి పాసైన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీటు లభించిందని ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో రిషితవర్మ, భార్గవి, చిన్మయి ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



లక్సెట్టిపేట: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ మండలంలోని కాంగ్రెస్ నాయకులు బుధవారం పట్టణంలోని బస్టాండ్ నుంచి దండేపల్లి మండలం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


కాసిపేట: పాల్గొన్న ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలు


నెన్నెల: పాలకవర్గంతో అధికారులు


లక్సెట్టిపేట: సన్మానం చేస్తున్న అధికారులు

ప్రజాప్రతినిధులకు వీడ్కోలు

దండేపల్లి/జైపూర్/లక్సెట్టిపేట/జన్నారం/కాసిపేట/నెన్నెల: పదవీ కాలం ముగియనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలను జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో ఘనంగా సన్మానించారు. జైపూర్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐదేళ్ల కాలం పాటు వారు చేసిన సేవలను కొనియాడారు. జన్నారంలో జరిగిన కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొని మాట్లాడారు. పార్టీలకతీతంగా ప్రజల్లో ఉంటూ అంకితభావంతో పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

కాంగ్రెస్ ఎంపీటీసీలు గైర్హాజరు..

దండేపల్లిలో మండల పరిషత్ పాలక వర్గ చివరి


జన్నారం: ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో ఎమ్మెల్యే

సమావేశం, పైగా సభ్యుల పదవీ కాలం ముగియడంతో కార్యాలయ ఆవరణలో సభ్యులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధికార పార్టీకి చెందిన ఎంపీపీతో పాటు ఇద్దరు ఎంపీటీసీలు, ఇద్దరు బీజేపీ ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు, అధికార పార్టీకి చెందిన మరో ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, సమావేశానికి, సన్మాన కార్యక్రమానికి హాజరు కాలేదు.


పాలకవర్గ సభ్యులతో జెడ్పీచైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి


దండేపల్లి: ఎంపీపీని సన్మానిస్తూ...

వారు హాజరు కాకపోవడంపై పలువురు పలు విధాలుగా చర్చించుకున్నారు. కార్యక్రమ నిర్వహణపై గైర్హాజరైన వారంతా కొంత అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

సంక్షిప్త వార్తలు

నిరుపేద వృద్ధురాలికి అండగా నిలిచిన సీఐ

మంచిర్యాలక్రైం: గౌతమినగర్‌కు చెందిన కాల్వా రాజేశ్వరి అనే వృద్ధురాలికి స్థానిక సీఐ బన్సీలాల్ 25కిలోల రైస్ బ్యాగు అందజేసి అండగా నిలిచారు.

స్థలం కేటాయించాలని వినతి

జైపూర్: జైపూర్ మేజర్ గ్రామ పంచాయతీలో సుమారు 30నుంచి 40స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, 500మంది మహిళలకు పైగా సభ్యులు ఉన్నప్పటికీ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి సరైన వేదిక లేక ఇబ్బంది పడాల్సి వస్తుందని జైపూర్ వెన్నెల సంఘానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ వనజారెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు.

సన్మానం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్‌డే, పోస్టల్ వర్కర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు విష్ణువర్ధన్ రావు, నాగమల్లేశ్వర్‌రావు, బద్రీనారాయణచంద్ర దత్, పి రమణ, చార్టెడ్ అకౌంటెంట్‌లు సూర్యప్రకాష్‌రెడ్డి, శ్యాంసుందర్‌సోని, పోస్టల్‌వర్కర్లు పి. గంగయ్య, రవీందర్‌లను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

'తప్పుల సవరణకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి'

దండేపల్లి: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రజాపాలన ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో తప్పుల సవరణకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందించారు.

బట్ట సంచులు పంపిణీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పుర ప్రజలకు కాటన్ క్యారీ బ్యాగులు పంపిణీ చేశారు. బట్ట సంచుల వాడకానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడాలన్నారు.

ఫోన్ అప్పగింత

దండేపల్లి: మండలంలోని చింతపల్లికి చెందిన ఆవునూరి మొగిలికి చెందిన ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి పట్టుకున్నారు. ఫోన్‌ను బుధవారం మొగిలికి అందించారు.